మాజీ సీఎం జలగం వెంగళరావుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి మనీలాల్‌షా తదితరులు

అబిడ్స్: గాంధీభవన్‌లో మాజీ సీఎం జలగం వెంగళరావు జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి మనీలాల్‌షా, ఉపాధ్యక్షుడు కుమార్‌రావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఆయన చేసిన సేవలను కొనియాడారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డా.మేడి రమణ ఆదివారం డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నుంచి ఇంత వరకు ఒక్క శాఖలో కూడ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయక పోవడం విచారకరమన్నారు.ఎస్సీ, ఎస్టీల ఉద్యోగాలను భర్తీ చేయకుండ ఖాళీగా ఉంచడం రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందన్నారు. ప్రభుత్వ శాఖలతో పాటు వర్సిటీలలో ఖాళీగా బ్యాక్‌లాగ్ టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగాలను భర్తీ చేసి ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

లిబర్టీ: చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించలేమని కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం దమ్ముంటే ప్రకటించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి సవాల్ విసిరారు. బీసీలు కన్నెర్ర చేస్తే ప్రభుత్వం మనుగడ సాగించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. బీసీ దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఉభయ సభల్లో ప్రవేశపెట్టలేదని కేంద్ర ప్రభుత్వం వల్ల సాధ్యంకాదని దమ్ముంటే ప్రకటించాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించే బిల్లును ప్రవేశపెట్టాలని కోరుతున్నా కేంద్ర ప్రభుత్వాలు తీరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేంద్రస్థాయిలో మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అడ్డంకులు ఏమిటని కుమారస్వామి సూటిగా ప్రశ్నించారు. ఏ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీసీల నుంచి గుణపాఠం కేంద్ర ప్రభుత్వానికి తప్పదని హెచ్చరించారు.

10న ఓయూ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ ఎన్నికలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ నాన్‌టీచింగ్ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ ఎన్నికల షెడ్యూల్డును ఎన్నికల అధికారులు విడుదల చేశారు. సొసైటీలో 9 పదవులకు ఈ నెల 10 జరిగే సిక్రెట్ బ్యాలెట్ ఎన్నికలకు నేటి నుంచి (5న) నామినేషన్లను స్వీకరించనున్నారు. 7న నామినేషన్ల ఉపసంహరణ, ఎన్నికల గుర్తులను ప్రకటించనున్నట్లు తెలిపారు. ఎన్నికలు క్యాంపస్‌లోని నాన్‌టీచింగ్ హోంలో జరగనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చు.

సంఘం విచ్ఛిన్నానికి పాల్పడితే సహించేది లేదు



మాట్లాడుతున్న కొండూరు గంగాధర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం విచ్ఛిన్నతకు పాల్పడితే సహించేది లేదని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ హెచ్చరించారు. సంఘం మాజీ అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు చేస్తున్నారని... ఆ విధంగా చేస్తే ఉరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఉద్యోగ సంఘాల జేఏసీ సదస్సు అనంతరం కొండూరు గంగాధర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 2026 వరకు తన పదవీ కాలం ఉందని అటువంటి తనను తొలగించే అధికారం ఏ ఒక్కరికి లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి 8సంఘాలకు ఓడీ సదుపాయం కల్పించారని గుర్తు చేశారు. సంఘం మాజీ అధ్యక్షుడు ప్రతి జిల్లాలో తిరుగుతూ సంఘం నాయకులను మభ్యపెడుతూ తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తనను 33 జిల్లాల్లోని 50వేల మంది ఉద్యోగులు ఎన్నికల అధికారి సమక్షంలో ఎన్నుకున్నారని అన్నారు. జేఏసీ తలపెట్టిన ఉద్యమాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలియజేశారు. జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావులు తమ సంఘం పై దృష్టి పెట్టాలని కోరారు.

నడక..నరకమే..!

- పాతబస్తీలో కానరానీ ఫుట్‌పాత్‌లు
- ఉన్నచోట్ల యథేచ్ఛగా ఆక్రమణ
- వ్యాపారాల నిర్వహణ
- ఇబ్బందుల్లో పాదచారులు
- పట్టించుకోని అధికారులు



ఫుట్‌పాత్‌లు లేకపోవడంతో రోడ్డుపైనే నడిచి వెళ్తున్న మహిళలు

చార్మినార్: అసలే ఇరుకు రోడ్లు..ఆపై ఉన్న కొద్దిపాటి ఫుట్‌పాత్‌లు సైతం యథేచ్ఛగా ఆక్రమణలకు గురికావడంతో పాతబస్తీలో పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనికితోడు కొందరు షోరూం యజమానులు షాపుల ముందున్న ఫుట్‌పాత్‌లు తమ సొంతమన్నట్లు వ్యవహరిస్తున్నారు. వీరికి స్థానిక లోకల్ లీడర్లు, కొంతమంది ప్రభుత్వ విభాగాల సిబ్బంది, అధికారుల అండదండలు తోడవ్వడంతో ప్రశ్నించే వారే కరువయ్యారు. ఇప్పటికే చార్మినార్ పెడస్ట్రియన్ ప్రాజెక్ట్ (సీపీపీ-చార్మినార్ కాలిబాట పథకం) పనులు చేపట్టి ఏళ్ల గడుస్తున్నా..ఇంకా ఫుట్‌పాత్‌లు అందుబాటులోకి రాలేదు. కొంతమంది సొంతంగా ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు కొనసాగిస్తుండగా..మరికొంత మంది షాపుల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా ఇతరులకు రోజు, వారం, నెలకు ఇంత...అంటూ అద్దెకు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హైకోర్టు ఆదేశించినా..

ఫుట్‌పాత్ కబ్జాలు తొలగించాలని గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో నగరంలో వెంటనే స్పందించిన అధికార యంత్రాంగం..పాతబస్తీలో మాత్రం పట్టించుకోవడం లేదు. పర్యాటక కేంద్రమైన చార్మినార్, మక్కా మసీదు, లాడ్‌బజార్ తదితర ప్రదేశాలను సందర్శించేందుకు నిత్యం పర్యాటకులు పెద్ద సంఖ్యలో పాతబస్తీకి వస్తుంటారు. దీంతో ఇక్కడి రోడ్లన్నీ వాహనాలతో రద్దీగా మారతాయి. అయితే ఫుట్‌పాత్‌లు లేకపోవడంతో వాహనాల మధ్య నుంచే రోడ్లపై బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోందని పాదాచారులు వాపోతున్నారు.

రోడ్లుసైతం ఆక్రమణ..

పాతబస్తీలో ఫుట్‌పాతులే కాదు..కొందరు రోడ్లను సైతం ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల చార్మినార్ ట్రాఫిక్ పోలీసులు పత్తర్‌గట్టి నుంచి మదీనా వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించినప్పటికీ పరిస్థితిలో మాత్రం మార్పు కనిపించడం లేదు. స్థానిక చిరు వ్యాపారులు, షోరూం నిర్వాహకులు తమకు సహకరించడం లేదని దక్షిణ మండలం ట్రాఫిక్ పోలీసులు అంటున్నారు.

సమన్వయంతో పని చేస్తే..

జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సమన్వయంతో పని చేస్తేనే ఆశించిన ఫలితాలుంటాయి. అక్రమంగా అద్దెలు వసూలు చేస్తున్న వారిని కట్టడి చేయాలి. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఫుట్‌పాత్ కబ్జాలు పూర్తిస్థాయిలో తొలగించాలి. చార్మినార్-మదీనా రోడ్డులో ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు, ఆక్రమణలను నియంత్రించాలి. రోడ్లపైనే నిల్చుని అమ్మకాలు చేస్తున్న వారిని క్రమపద్ధతిలో అనుమతించాలి.అలాగే ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చోట సిబ్బంది సంఖ్యని పెంచడంతో పాటు ఇరుకు చోట్ల రోడ్ల విస్తరణ చేపట్టాలి.

నీళ్లు లేకపాయె..ఉపాధి కరువాయె..!

- కుమ్మరివాడలో మరమ్మతులకు గురైన బోర్‌వెల్
- నెలరోజులుగా నీటి కటకట



బస్తీలో నీళ్లు లేని ట్యాంక్



కుమ్మరి వాడలో కుండలు

నాంపల్లి: రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి ఆ కుటుంబాలది. బస్తీలోనే ఉదయం నుంచి సాయంత్రం వరకు మట్టి కుండలు తయారు చేసి విక్రయించి జీవనోపాధి పొందుతుంటారు. అయితే నీటి ఎద్దడి కారణంగా నెల రోజులుగా వారికి పని లేకుండా పోయింది. ఇది ఓల్డ్ మల్లెపల్లి ఫీల్‌ఖానాకు సమీపంలోని కుమ్మరివాడ బస్తీవాసుల దుస్థితి. ఇక్కడ 200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అందరూ కుమ్మరి వృత్తి మీదే ఆధారపడి జీవనాన్ని సాగిస్తున్నారు. అయితే బస్తీలో బోర్‌వెల్ పాడై నెల రోజులైంది. వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేస్తే బోర్‌వెల్‌కు ఉన్న కాలిపోయిన మోటర్‌ను తీసుకెళ్లి కొత్తది అమర్చలేదు. దీంతో బస్తీవాసులకు నీళ్ల లేక అవస్థలు పడుతున్నారు. మరోవైపు నీళ్ల లేక కుమ్మరి పనులు సైతం నిలిచిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోర్‌వెల్‌ను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.

ఓల్డ్ సిటీ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



చార్మినార్: పూల్ బాగ్ చమన్ జీహెచ్‌ఎంసీ మైదానంలో ఓల్డ్ సిటీ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భీమగౌని ఉమేశ్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా తీగల నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.రఘు, జాయింట్ సెక్రెటరీగా బి.శేఖర్, కోశాధికారిగా ఎం.కిరణ్ చారి, కార్యవర్గ సభ్యులుగా వి. ఆంజనేయులు చారి, సీఎస్ సురేందర్, ముఖ్య సలహాదారుడిగా ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ.. పాతబస్తీ ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా అసోసియేషన్ ఆధ్వర్యంలో వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

పాకిస్తాన్ పౌరులను పంపించాల్సిందే



నిరసన ర్యాలీలో గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఉమా మహేందర్ తదితరులు

చార్మినార్: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్ పౌరుల వీసాలు రద్దు చేసినా వారిని వారి దేశానికి పంపించేందుకు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు చొరవ చూపడం లేదని గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు టి. ఉమా మహేందర్ విమర్శించారు. వారి తీరుకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో పాతబస్తీలోని చార్మినార్ నుంచి గుల్జార్ హౌస్ వరకు ఆదివారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భద్రత నేపథ్యంలో కేంద్రం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అన్ని రాష్ట్రాలు స్వాగతిస్తున్నాయని, కానీ కాంగ్రెస్ పాలిత తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకుని దేశభద్రతకు పాటుపడేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గోషామహల్ కార్పొరేటర్ లాల్ సింగ్, జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ తో పాటు బీజేపీ నాయకులు అమర్ సింగ్, దీపక్, దేవర శ్రీనివాస్, శివ యాదవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీజీఈ జేఏసీ సమావేశానికి తరలిన డ్రైవర్లు

నాంపల్లి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ డ్రైవర్లు ర్యాలీగా అక్కడికి తరలివెళ్లినట్లు డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ హాసం హుస్సేనీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్దార్ మంజీత్ సింగ్ పేర్కొన్నారు. చింతలబస్తీలోని డ్రైవర్ల కేంద్ర సంఘం నుంచి అసెంబ్లీ, బషీర్‌బాగ్, హైదర్‌గూడ మీదుగా బాగ్‌లింగంపల్లికి చేరుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఈరవేణి పద్మారావు, రాష్ట్ర కార్యదర్శి అలీం ఖాన్ పాల్గొన్నారు.

విధుల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాలి



గోల్కొండ: విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ సూచించారు. నూతనంగా ఏర్పాటైన టోలిచౌకి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన ఎల్.రమేశ్ నాయక్ ఆదివారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో కొంతకాలంగా నేరాల సంఖ్య పెరిగిందని, ఇప్పుడు టోలిచౌకి పోలీస్‌స్టేషన్ ఏర్పాటుతో వాటికి అడ్డుకట్ట వేయవచ్చన్నారు.

బాధ్యతల స్వీకరణ



సంతోష్‌నగర్: కంచన్ బాగ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా వై.కమల్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని పేర్కొన్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లపై నిరంతర నిఘా పెడుతామని తెలిపారు.

అంబర్‌పేట ఫ్లైఓవర్ ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి

అంబర్‌పేట: అంబర్‌పేట ఫ్లైఓవర్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు తెలిపారు. నేడు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేతులు మీదుగా ప్రారంభించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో చేసిన ఏర్పాట్లను ఆయన పార్టీ శ్రేణులు, అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించిన ‘దాసరి’



ఉత్తమ లఘు చిత్ర బృందాలకు అవార్డులు అందజేస్తున్న ప్రముఖులు

గన్‌ఫౌండ్రీ: దర్శకరత్న దాసరి నారాయణరావు ఎందరో ప్రతిభావంతులను ప్రోత్సహించారని టాలీవుడ్ క్రియేటివ్ డైరెక్టర్స్ అసోసియేషన్‌అధ్యక్షుడు కె.మోహన్ అన్నారు. దాసరి జయంతి సందర్భంగా టాలీవుడ్ క్రియేటివ్ డైరెక్టర్స్ అసోసియేషన్, రెయిన్‌బో చిల్డ్రన్స్‌ఫిలిం సొసైటీ సంయుక్తంగా రవీంద్రభారతిలో టాలీవుడ్ ఫిల్మ్ ఫెస్టివల్‌ని ఆదివారం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రియేటివ్ ఫీల్డ్‌లోని కొత్త తరాన్ని ఎంకరేజ్ చేయాలనే ఉద్దేశంతోనే కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. పలు షార్ట్ ఫిల్మ్స్, ఫ్యూచర్ ఫిల్మ్స్ పోటీల్లో పాల్గొనగా 15 షార్ట్ ఫిల్మ్స్, 3 ఫ్యూచర్ ఫిల్మ్స్, 1 మినీ మూవీ వివిధ విభాగాల్లో అవార్డులకు ఎంపికైనట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా హాజరైన దర్శకులు ముప్పలనేని శివ, వి.సముద్ర, నిర్మాతలు నాగులపల్లి పద్మిని, వి.మురళీధర్, రిటైర్డ్ తహసీల్దార్ బిక్కవల్లి సత్యానందం, రిటైర్డ్ జడ్జి మలయాద్రి, నటులు లోహిత్ కుమార్, ప్రసన్నకుమార్ అవార్డు గ్రహీతలకు మెమొంటోలు అందజేశారు. భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని మోహన్ తెలిపారు. నివేదిత యాంకర్‌గా వ్యవహరించిన కార్యక్రమంలో యంగ్ డైరెక్టర్స్ ఉత్సాహంగా పాల్గొని, ప్రతిభ చాటుకున్నారు.

ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాలకు పాలాభిషేకం



గౌలిపురా చౌరస్తాలో..



బేలా చౌరస్తాలో..

గౌలిపురా: కేంద్రం ప్రభుత్వం జనగణనతో పాటు కుల గణన చేపడుతామని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ గౌలిపురా డివిజన్ అధ్యక్షుడు ఇ.సుమన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గౌలిపురా చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు ఆదివారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర, సీనియర్ నాయకులు ఆదర్శ మహేశ్, సీహెచ్.రూప్‌రాజ్, మోకాళ్ల వెంకటేశ్, జి.ధీరజ్ లాల్, కె.రాజ్ కుమార్, జి.రఘుకాంత్, జమాల్‌పూర్ అశోక్, ఎ.భానుప్రకాశ్, ఎ.శివచంద్రగి, కె.సాయి కుమార్, ఎ.మహేందర్ గిరి, సీహెచ్.నర్సింగ్, సంగ్రామ్, రవి తదితరులు పాల్గొన్నారు.

బేలా చౌరస్తాలో..

బీజేపీ ఓబీసీ మోర్చా గోల్కొండ జిల్లా ఉపాధ్యక్షుడు బి.కరంజయ ఆధ్వర్యంలో బేలా చౌరస్తాలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గోల్కొండ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు ఎం.కుమార్‌తో పాటు నాయకులు చేతన్ కుమార్ సూరి, పవన్ మిశ్రా, వీరమణి, పి.లక్ష్మణ్, నరేశ్ అవస్థీ, శైలజ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు

జియాగూడ: కార్వాన్ పంచముఖ బ్రహ్మదేవాలయంలో ఈనెల 6 నుంచి 8 వరకు మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు కార్వాన్ విశ్వకర్మ సేవా సంఘం అధ్యక్షుడు సి.నరహరిచారి, హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నామని రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్యాల భాస్కర్, సలహాదారు ఆర్.ప్రేమ్‌చారి, కోశాధికారి ఆర్.రమేశ్‌చారి తెలిపారు. ఈ మేరకు ఆలయంలో ఉత్సవాల బ్రోచర్‌ను ఆదివారం విడుదల చేశారు. కార్యక్రమంలో అనంతచారి, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నరహరిచారి, రాజు, భాస్కర్

ఉగ్రదాడిని ఖండిస్తూ నిరసన ర్యాలీ



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడిని ఖండిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ర్యాలీ చేపట్టారు. కార్వాన్, గుడిమల్కాపూర్ నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా నాయకులు పాకిస్తాన్ ముర్దాబాద్ అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్, సచిన్ కాంబ్లేకర్, టి.అమర్ సింగ్, నామా యాదగిరి, సి.ఉదయ్‌కుమార్, దేవర వంశీ, అశ్విన్ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు





గన్‌ఫౌండ్రీ: ప్రముఖ కూచిపూడి నృత్య సంస్థ త్రైలోక్య ఆర్ట్స్ అసోసియేషన్ 16వ వార్షికోత్సవ వేడుకలను రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థకు చెందిన 130 మంది విద్యార్థులు వివిధ అంశాలపై చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కోట్ల హన్మంతరావు హాజరై మాట్లాడుతూ.. పిల్లలు ఏకాగ్రతపై దృష్టి పెట్టేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. అనంతరం చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ నాట్య గురువు డాక్టర్ వేదాంతం వెంకట నాగ చలపతి, ఎస్.సుధామాల, సంస్థ వ్యవస్థాపకురాలు ఇందిరా పరశురాం, అధ్యక్షుడు సీతా రామచార్య తదితరులు పాల్గొన్నారు.

‘కోట’.. కిటకిట



గోల్కొండ: గోల్కొండ కోటలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొన్నది. సెలవు రోజు కావడంతో పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోట గోడలు, ఫిరంగులు, దర్వాజల వద్ద సెల్ఫీలు దిగారు. రామభక్తులు కోట ఎగువ భాగంలో గల భక్త రామదాసు బందీఖానాను తిలకించారు. మరోవైపు కోటలోని ఆయుధ గారం, కుతుబ్‌షాహీ రాణులు నివసించిన రాణిమహల్‌లో ఆయుధాల ఫొటోలు తీసుకున్నారు.

ప్రశాంతంగా ‘నీట్’



హాజరైన విద్యార్థులు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన నీట్ ప్రశాంతంగా జరిగింది. కంచన్‌బాగ్‌లోని బీపీడీఏవీ, డీఎల్‌ఎస్‌కే పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులు సమయానికి కంటే ముందుగానే హాజరయ్యారు. సిబ్బంది వారిని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించిన అనంతరం లోనికి అనుమతించారు. విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాతబస్తీలోని ప్రభుత్వ సిటీ కళాశాలలో..

శాలిబండ: పాతబస్తీలోని ప్రభుత్వ సిటీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన నీట్ ప్రశాంతంగా జరిగింది. అయితే పరీక్షల కేంద్రాల వద్ద ఏర్పాట్లు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందుల పడ్డారు.



సంతోష్‌నగర్‌లో..

ట్యాంక్ ఇలా..నీళ్లు ఎలా..?



ఖాజీగల్లీలో పగిలిన వాటర్ ట్యాంక్

గోల్కొండ: ప్రజల నీటి అవసరాల కోసం గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. కార్వాన్, గోల్కొండ తదితర డివిజన్లలోని నీటి సరఫరా తక్కువ ఉన్న ప్రాంతాల్లో బోర్లు వేసి వాటి పక్కనే ట్యాంకర్లు ఏర్పాటు చేసి మోటార్ల ద్వారా నీటిని నింపేవారు. దీంతో బస్తీవాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. అయితే వీటి నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. దీంతో వేసవిలో ఇటు నల్లాలో సరిపడా నీళ్లు రాక, అటు బోరు ట్యాంకుల్లో నీరు లేక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయమై బల్దియా వార్డు కార్యాలయాల్లో ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండాపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ధ్వంసమైన చోట్ల నూతన ట్యాంకులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.